క్లుప్తంగా

అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హన్మకొండ: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానాలను గ్రామీణ ప్రాంతాల ప్రజల వద్దకు తీసుకెళ్లి వారిని మరింతగా చైతన్యం చేయాల్సిన బాధ్యత అంబేడ్కర్ సంఘం కార్యకర్తలపై ఉందని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య సూచించారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ అంబేడ్కర్ సంఘం హనుమకొండ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా ఇన్‌చార్జ్ మేకల చేరాలు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జన్ను నర్సయ్య మాట్లాడుతూ ఇటీవల కాలంలో అంబేడ్కర్ జపం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన ఆశయ సాధనకు చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ఆనంద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్, నాయకులు అంబాల ఆర్య రాజ్, తాళ్లపల్లి ఐలయ్య, తాళ్లపల్లి అశోక్, జయరాజు, వి.కుమారస్వామి, ఆశీర్వాదం, సారయ్య, సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

కేయూ క్యాంపస్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నిర్వహించింది నిరుద్యోగుల మార్చ్ కాదని బీజేపీ కార్యకర్తల మార్చ్ అని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్‌వీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఎద్దేవాచేశారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌వీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంటే బీజేపీ నాయకులు ఇక్కడ నిరుద్యోగ మార్చ్ నిర్వహించటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్రంలోని 16 లక్షల ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ కోఆర్డినేటర్ లంక రాజగోపాల్, బాధ్యులు కందికొండ తిరుపతి, ప్రశాంత్, వస్తం అనిల్, వినోద్, సాయి, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వీడుతున్న భ్రమలు



హన్మకొండ: బీఆర్‌ఎస్, బీజేపీ పట్ల ప్రజలు తమ భ్రమలు వీడుతున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి విమర్శించారు. హనుమకొండ హౌసింగ్ బోర్డులో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కేఎల్‌ఎస్.రెడ్డి కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి రాఘవరెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. ఈక్రమంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, కాంగ్రెస్ నాయకులు కట్ట రఘుపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, రఘు, వల్లపు యాదగిరి, కొంద్ర శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఎంజీఎం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 29వ డివిజన్ రామన్నపేటలో డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ ఆధ్వర్యంలో ముస్లింలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి, పార్లమెంటరీ మీడియా ఇన్‌చార్జ్ మహమ్మద్ ముస్తాక్ నేహాల్, హనుమకొండ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు కేతిడి దీపక్‌రెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ బుద్దజగన్ చేతుల మీదుగా ముస్లిం మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో నగర బీసీసెల్ వైస్ ప్రెసిడెంట్ శిరబోయిన సతీష్, డివిజన్ మైనార్టీ సెల్ నాయకులు రఫిక్, హలీంబాయ్, మోసిస్, అత్తర్‌సలీం, గొర్రె మహేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

మడికొండ: 46వ డివిజన్ పరిధిలోని మడికొండలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మునిగాల సరోజన ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, వల్లెపు ఉపేందర్, నర్మెట భిక్షపతి, కొలిపాక కుమార్, కుమార్‌రాజ, అబ్బసాయిలు, రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'మోడల్' పరీక్ష

కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులకు గాను 810 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 290 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు వెడల్పునకు మోకాలడ్డు

- విస్తరణ పనులను అడ్డుకున్న కొంతమంది స్థానికులు
- ప్రమాదకరంగా నర్సంపేట – వరంగల్ ప్రధాన రహదారి
- రోడ్డును ఆనుకుని ఉన్న ఓపెన్ డ్రెయినేజీ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



దయానందకాలనీ సమీపంలో రోడ్డును ఆనుకొని ఉన్న డ్రెయినేజీ



ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారి

కాశిబుగ్గ: స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన నర్సంపేట – వరంగల్ ప్రధాన రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 100ఫీట్ల ఈరోడ్డును స్మార్ట్‌సిటీ పథకంలో 150అడుగులకు విస్తరించేందుకు సుమారు రూ.45 కోట్ల వ్యయంతో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలోని పనులు ప్రారంభించారు. వెంకట్రామ జంక్షన్ నుంచి కట్ట మల్లన్న జంక్షన్ వరకు 150 ఫీట్ల వెడల్పు పనులు చేపట్టగా, కొంత మంది అడ్డుకోవడంతో ఆజంజాహి మిల్ (రాంకీ విల్లాస్) గేటు నుంచి జంక్షన్ వరకు 100 ఫీట్ల వెడల్పునకు కుదించినట్లు తెలిసింది. వెంకట్రామ థియేటర్ ఎదురుగా ఉన్న ప్రాంతంలోని ఓపెన్ డ్రైయినేజీ పూర్తిగా రోడ్డును ఆనుకుని ఉంది. దాంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కనే ఓపెన్ డ్రైయినేజీ ఉండడంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. ఆ ప్రాంతంలో ఇటీవల తెల్లవారుజామున ఒక వ్యక్తి బైక్‌పై వెళ్తూ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. దాంతో ఇరువురు మృత్యువాత పడ్డారు.

స్వలాభం కోసం స్టే

వెంకట్రామ జంక్షన్ ఎదురుగా ఉన్న ఓపెన్ డ్రైయినేజీని తొలగించి రహదారిని విస్తరించాలని ఆర్అండ్‌బీ అధికారులు ప్రయత్నాలు చేసినా ఇదే ప్రాంతంలోని దయానందకాలనీకి చెందిన కొంతమంది తమ స్వలాభం కోసం కోర్టును ఆశ్రయించి పనులకు అడ్డుకున్నట్లు తెలిసింది. రోడ్డు విస్తరణతో తమ ఇళ్ల ముందు కొంతస్థలం పోతుందని భావించిన వారు.. కోర్టు నుంచి స్టే తీసుకు వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. స్టే తీసుకువచ్చినా కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టే వేకెట్ చేయించి విస్తరణ పనులు పూర్తి చేయాల్సిన ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

విస్తరణ పనులు పూర్తి చేయాలి



నర్సంపేట – వరంగల్ ప్రధాన రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలి. వెంకట్రామ టాకీస్ ఎదురుగా రహదారిని ఆనుకుని ఓపెన్ డ్రెయినేజీ ఉండడంతో రోడ్డు వెడల్పు తక్కువగా ఉంది. దాంతో అక్కడ తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

– పోలెపాక ఏసు, వాహనదారుడు

అధికారుల నిర్లక్ష్యంతోనే..



అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనం కారణంగా అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. వెంకట్రామ జంక్షన్ సమీపంలోని ఓపెన్ డ్రెయినేజీ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఓపెన్ డ్రెయినేజీని తొలగించి రోడ్డును విస్తరించాలి.

– కునుకుంట్ల రంజిత్, అబ్బనికుంట

ఉపవాస దీక్షలతో దానగుణం పెంపు



ఖిలా వరంగల్: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



హన్మకొండ: విందు స్వీకరిస్తున్న ముస్లింలు

ఖిలా వరంగల్: భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ ఉపవాస దీక్షలతో ముస్లింల్లో సేవా, దానగుణం మరింతగా పెంపొందుతాయని తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్, ఈద్గా మసీదు ఉపాధ్యక్షుడు ఎం ఏ.జబ్బార్ అన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శంభునిపేటలో ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై చాంద్‌పాషా, హైమాద్‌ఖాన్, సమీనా, అమ్జద్, ఎండీ.ఫసీ, స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ, పోశాల స్వామి, కొంతం మోహన్, తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఎంఏ.జబ్బార్‌తో కలిసి మాట్లాడారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సలావొద్దీన్, నసీర్, దస్తగిరి, అమ్జద్, ముగ్దుం, హస్సేన్ అలీ, యాకూబ్, కలీమ్, అష్రఫ్, శర్ఫొద్దీన్, మాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి రంజాన్ ప్రతీక

హన్మకొండ: మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త జాన్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో జాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ తన తండ్రి హనుమకొండలో ఉద్యోగం చేశారని, తాను ఇక్కడే చదువుకున్నానని, అప్పటి ప్రేమ, ఆప్యాయతలు, సోదరభావాన్ని కలిగి ఉండేందుకు ఈవిందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంజాన్ మాసం, పండుగ ముస్లింలకు ఎంతో పవిత్రమని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు ఖుర్షపాషా, సైలాని బాబా, మీర్జా అజీజ్ బేగ్, మక్దూమ్ పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు

నయీంనగర్: 6వ డివిజన్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లు, ముస్లింలు పరస్పరం పండ్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చెన్నం మధు మాట్లాడుతూ క్రిస్టియన్లు, ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గురుద్వార్ అధ్యక్షుడు మహేందర్‌సింగ్, మసీదు అధ్యక్షుడు బాబా భయ్యా, బీఆర్‌ఎస్ నాయకులు ఖుద్దుస్, అజీజ్ పాల్గొన్నారు.



హన్మకొండ: విందు స్వీకరిస్తున్న ముస్లిం పెద్దలు



6వ డివిజన్‌లో..

పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న గౌరీశంకర్

వరంగల్ అర్బన్: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా డిపార్ట్‌మెంటల్ ఫోరం కన్వీనర్ దొడ్డిపాటి హరికుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసిన అనంతరం ద్విచక్ర వాహనర్యాలీని బల్దియా జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ధర్మరాజు, రాజారాపు భాస్కర్, బొట్ల రమేష్, రావుల ఆనంద్, బషీర్, సోహెల్, చీకటి గిరి, ప్రకాష్, సురేష్, సుష్మిత, మహేశ్వరి, రెడ్డి రజిత, చందన, రజినీ, హేమలత, సురేష్ నవనీత్, రాజమౌళి, మహేష్, భరత్, మల్లికార్జున్, ప్రకాష్, శ్రీకాంత్, సురేందర్, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట ఇన్‌స్పెక్టర్‌గా రాజు



కాజీపేట: కాజీపేట ఇన్‌స్పెక్టర్‌గా సార్ల రాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేసిన ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి మందమర్రి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. దాదాపు నెల రోజులుగా ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈక్రమంలో సార్ల రాజును సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉన్నతాధికారులను రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన ఇన్‌స్పెక్టర్‌ను సిబ్బంది అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనాథ్

ఖిలా వరంగల్: రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని ఫోర్ట్ వరంగల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కాకతీయ ఉద్యోగుల పరపతి సంఘం అధ్యక్షుడు ఎండీ.హఫీజొద్దీన్, ప్రధాన కార్యదర్శి జారతి సత్యనాథ్ అన్నారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమర కోటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో పరపతి సంఘం ఉపాధ్యక్షుడిగా వేల్పుల రవీందర్ అధ్యక్షతన ఫోర్ట్ వరంగల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కాకతీయ ఉద్యోగుల పరపతి సంఘం 13వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. పొదుపు చేసుకున్న డబ్బులను మరింత రెట్టింపు చేసి సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం ఏర్పడి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతీ సభ్యుడికి 10గ్రాముల బంగారం ఇచ్చేందుకు తీర్మానంచేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యకుడిగా ఎండీ.హఫీజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా వేల్పుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జారతి సత్యనాథ్, సహాయ కార్యదర్శిగా బాలబోయిన జగన్‌మోహన్, కోశాధికారిగా మిట్టపెల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో బి.జగన్‌మోహన్, నాగవెల్లి సాంబయ్య, వీరస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు దళితరత్న అవార్డు

కాజీపేట అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సౌరం ప్రవీణ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ దళితరత్న అవార్డును అందజేసింది. అంబేడ్కర్ 132వ జయంతి వేడుకల్లో భాగంగా హైదరాబాద్ జియాగూడలో దళితరత్న అవార్డు అందజేయడం ఆనందంగా ఉందని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

'బలగం' కొమురయ్యకు సన్మానం

హసన్‌పర్తి: బలగం సినిమాలో హీరో తండ్రి పాత్ర పోషించిన కొమురయ్య (కితిరి సుధాకర్‌రెడ్డి)ను 55వ డివిజన్ భీమారంలో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతు బంధుసమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాజుల గోవర్ధన్, సాయి, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుందాం

ఖిలా వరంగల్: నాయకులు, కార్యకర్తలందరు కలిసి సమష్టిగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకుందామని కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, ముస్కమల్ల అరుణ, వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో 33, 34, 37, 38, 41 డివిజన్లలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఆదివారం వేర్వేరుగా ఇల్లిల్లు తిరుగుతూ బొట్టుపెట్టి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ముస్కమల్ల సుధాకర్, బైరబోయిన దామోదర్, బోగి సురేష్, బిల్లా రాజు, మాజీ కార్పొరేటర్ బిల్లా కవిత, శ్రీకాంత్, పగడాల సతీష్ పాల్గొన్నారు.


'నాయినిని విమర్శించే స్థాయి మీదా..?'



మాట్లాడుతున్న పెరుమాండ్ల రామకృష్ణ

హన్మకొండ చౌరస్తా: 'భూకబ్జా కేసులో ఒకరు జైలుకెళ్తే, సీఐడీ విచారణలో నిందితుడిగా మరొకరు రికార్డులకెక్కిన మీకు మా నాయకుడు నాయిని రాజేందర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు' అని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ విమర్శించారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, మాడిశెట్టి శివశంకర్‌లు చేసే భూకబ్జాలు, అన్యాయాలను ఎదుర్కొంటున్న నాయిని రాజేందర్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. డివిజన్లలో ఎవరిని తిరగనివ్వాలో, ఎవరిని తిరగనివొద్దో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. త్వరలోనే బీఆర్‌ఎస్ నాయకులకు గుణపాఠం తప్పదని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, నాయకులు పులి అనిల్, కూర వెంకట్, సతీష్, సంపత్, లక్ష్మి, సారంగం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

రామన్నపేట: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ములుగురోడ్డు సమీపంలోని గార్డియన్ ఆస్పత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరంగల్ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల్లో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం ప్రతిఏటా ఏప్రిల్ 14నుంచి 20వ తేదీ వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్, ఆస్పత్రి సిబ్బంది ఆజాద్, ఎస్.వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, బి.యాదగిరి, బి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో చలివేంద్రం ఏర్పాటు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో లక్ష్మి గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ బాటసారుల దాహర్తి తీర్చేందుకు ఎనిమిదేళ్లుగా వేసవిలో సంఘం సభ్యుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వేముల నాగరాజు, దాసి శివకృష్ణ, మండల సురేష్, ఆదికిరణ్, శ్రీకాంత్, చందు, శ్రీను, మహేశ్వర్, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్జువా పార్టీలతో పొత్తులు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వరంగల్ చౌరస్తా: సమాజంలో పెరిగిపోతున్న దోపిడీకి వ్యతిరేకంగా కష్టజీవుల రాజ్యం కోసం కలిసి ఉద్యమించాల్సిన కమ్యూనిస్టు పార్టీలు.. బూర్జువా పాలక పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం వల్ల ఐక్యతకు విఘాతం ఏర్పడుతోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మతోన్మాద నియంతృత్వ విధానాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమరజీవి మద్దికాయల ఓంకార్ చూపించిన బాటలో పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు. గాస్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈనెల 19న రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామంలో 51 ఫీట్ల స్తూపాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంద రవి, జిల్లా కమిటీ సభ్యులు ఐతం నాగేష్, అప్పనపురి నరసయ్య, నగర నాయకులు రాయినేని ఐలయ్య, గోరంటాల శరత్‌బాబు, పరిమిళ్ల గోవర్ధన్ రాజు, సుధీర్, ప్రేమలత, అనుష పాల్గొన్నారు.

ఆ ఆస్పత్రికి జయశంకర్ పేరు పెట్టాలి



నినాదాలు చేస్తున్న సేవా సమితి నాయకులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ సెంట్రల్ జైలు స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రికి తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టాలని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని చార్‌బౌళిలోని ఎంఎస్‌ఏ ఫంక్షన్ హాల్‌లో ద్రావిడ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వకర్మల ఆత్మీయ అంతర్మథనం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల పాత్ర చాలా కీలకమైందని గుర్తుచేశారు. జయశంకర్ సార్ పాత్ర ఎనలేనిదని, ఆయన జీవితాంతం తెలంగాణ కోసం కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ ఆదరణ లేక, ప్రపంచీకరణతో రాష్ట్రంలోని సుమారు 15లక్షల మంది విశ్వకర్మలు వృత్తుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో విశ్వకర్మలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ మట్టెవాడ విజయకుమార్, ఐలాపురం వేణుచారి, పీఆర్ వెంకటరమణ, సుబోదాచారి, సర్వేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై వివాదం

- సమాచారం ఇవ్వకుండానే ప్రార్థన మందిరం ప్రహరీ కూల్చివేత



కూల్చివేసిన ప్రహరీ

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులపై వివాదం నెలకొంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు వ్యవహరించిన తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భీమారం సెంటర్ నుంచి బొల్లాయి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అయితే, బొల్లాయి వద్ద నుంచి, భీమారం మెయిన్ సెంటర్ నుంచి కానీ విస్తరణ పనులు చేపట్టాలి. అయితే, మధ్యలో నుంచి విస్తరణ పనులు చేపట్టారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచారం ఇవ్వకుండానే..

ఇటు బొల్లాయి, అటు మెయిన్ సెంటర్‌కు మధ్యలో ఉన్న ఓ ప్రార్థన మందిరం ప్రహరీ నుంచి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆ వర్గం వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి నుంచి లేదా తుది నుంచైనా విస్తరణ పనులు చేపట్టాల్సి ఉండగా, ప్రార్థన మందిరం నుంచి పనులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నిస్తున్నారు. మళ్లీ ప్రహరీ నిర్మాణం చేపట్టాలంటే రూ.లక్ష ఖర్చు అవుతుందని అన్నారు. విస్తరణ పనులపై బాధితులతో సమావేశం ఏర్పాటు చేయకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకపక్షంగా పనులు చేపట్టడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. సమాచారం ఇవ్వకుండా ప్రార్థన మందిరం ప్రహరీ కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ప్రార్థన మందిర ప్రముఖుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను సోమవారం కలిసి పరిస్థితిని వివరించాలని నిర్ణయించారు.


దళిత కాలనీల్లో విద్యుత్ సరఫరా బంద్



అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

హసన్‌పర్తి: వంగపహాడ్‌లోని దళిత కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ కాలనీల్లోని కొంతమంది వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని అధికారులు గుర్తించి కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ 220 ఎస్సీ కుటుంబాలు ఉండగా, 160 కుటుంబాలు మాత్రమే విద్యుత్ సర్వీస్‌ను కలిగి ఉన్నాయి. సర్వీస్ లేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. అయినప్పటికీ ఆ కుటుంబాలు స్పందించపోగా, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాయి. ఈక్రమంలో నాగారం సబ్‌స్టేషన్ ఏఈ తరుణ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది ఎస్సీ కాలనీల్లో ఆదివారం పర్యటించారు. కరెంట్ లేక తాము రెండు రోజులుగా చీకటిలో మగ్గుతున్నామని అధికారుల ఎదుట బాధితులు వాపోయారు.

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

మడికొండ: మడికొండ అంబేడ్కర్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడబోయిన ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి కిషన్, కోశాధికారిగా మూల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా రొడ్డ దయాకర్, జిట్ట అనిల్, కాగిల శంకర్, సహాయ కార్యదర్శిగా మూల నవీన్‌కుమార్, మద్దెల కుమార్, గుండాల రమేష్, దార సతీష్, కార్యవర్గ సభ్యులుగా జానపట్ల రాజు, అక్కపెల్లి వెంకటస్వామి, అంకేశ్వరపు రాము, జిట్ట సదానందం, దాసరి ప్రణీత్, నెలకంటి వెంకటేష్, చెన్నమల్ల భాస్కర్ ఎంపికయ్యారు. అలాగే, యూత్ అధ్యక్షుడిగా అంకూస్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దార ధనుంజయ్‌ను ఎన్నుకున్నారు.